కేసీఆర్‌ను ఫాంహౌస్‌లోనే ఉంచుదాం..


రామన్నపేట: మాట్లాడుతున్న శివకుమార్, పక్కన నాయిని రాజేందర్‌రెడ్డి


హన్మకొండ: ప్రచారం నిర్వహిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి

- రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఖాయం
- పశ్చిమ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్

రామన్నపేట: దేశంలోనే అత్యంత అవినీతి గల వ్యక్తి సీఎం కేసీఆర్ అని, ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పి అతడిని ఫాంహౌస్‌కే పరిమితం చేయాలనేఇ ఓటర్లను కర్నాటక డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ కోరారు. నాయిని రాజేందర్‌రెడ్డి గెలుపుకోసం ప్రజాదీవెన యాత్రలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలోని 29వ డివిజన్ పాపయ్యపేట చమన్‌లో శుక్రవారం రాత్రి కార్నర్ మీటింగ్‌లో శివకుమార్ ప్రసంగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. సోనియాగాంధీతో ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందని పేర్కొన్నారు. రాష్ట్రం ఇస్తే తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని మాట ఇచ్చి.. మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత దళితుడిని సీఎం చేస్తానని మాట తప్పారని ఎద్దేవాచేశారు. టీఎస్‌పీఎస్సీలో 17సార్లు పేపర్లు లీక్ కావడం బీఆర్ఎస్ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. దళితులకు మూడు ఎకరాలు ఇస్తానని మోసం చేసి, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కటిస్తానని మాట తప్పి, కాళేశ్వరం ప్రాజెక్టుతో రూ.లక్ష కోట్ల నిధులను దుర్వినియోగం చేసిన కేసీఆర్ తమకు అవసరమా ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి సంతకం ఆరు గ్యారెంటీల అమలుపైనే అని స్పష్టంచేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని శివకుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్ణాటక మంత్రి దినేష్ గుండురావు, మాజీ కార్పొరేటర్ బుద్ద జగన్, మహమ్మద్ మదస్సీర్ ఖయ్యూం, డివిజన్ ప్రెసిడెంట్ ఓరుగంటి పూర్ణ, మహేష్‌కుమార్‌గౌడ్, అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మాటలతో మభ్యపెడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ తమ మాయమాటలతో మభ్యపెడుతూ ప్రజలను మోసం చేస్తున్నారని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజాదీవెన యాత్రలో భాగంగా నియోజకవర్గం పరిధిలోని 8వ డివిజన్‌లోని కుమార్‌పల్లి, పాలజెండా, బొమ్మల యాపచెట్టు, టైలర్ స్ట్రీట్, గుడిబండల్, ఏనుగులగడ్డ ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను వివరించి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జ్ సంజయ్ జాగీర్దార్, కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ, నాయకులు మనోహర్, ప్రదీప్, రాజు, డాక్టర్ రామకృష్ణ, ఖాదర్ అలీ, మన్సూన్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జ్యోతి, భిక్షపతి, స్వామిచరణ్ పాల్గొన్నారు.

గుడిసెవాసుల గుండెల్లో గులాబీ దళపతి


హన్మకొండ: వినయ్‌భాస్కర్‌కు స్వాగతం పలుకుతున్న గుడిసెవాసులు


బీఆర్ఎస్‌లో చేరిన వారితో దాస్యం వినయ్‌భాస్కర్

- బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: గుడిసెవాసులు గుండెల్లో గులాబీ దళపతి కేసీఆర్ కొలువై ఉన్నారని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. నియోజకవర్గంలోని ఇరవై గుడిసెవాసుల ప్రాంతాల్లో వినయ్‌భాస్కర్ శుక్రవారం పర్యటించి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు గూడు, నీడ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ 58ను తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికే చాలామంది గుడిసెవాసులకు తను పట్టాలు ఇప్పించానని అన్నారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడగానే మిగతా వారందరికీ పట్టాలు ఇప్పించి హక్కుదారులను చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడిసెవాసులు సంఘం నాయకుడు సిరబోయిన కరుణాకర్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

హన్మకొండ: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోకి 47, 62, 63వ డివిజన్ల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పెసరు రవి, కిశోర్‌సింగ్, ఠాగూర్‌లాల్, లాల్ మహమ్మద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా, వారికి దాస్యం వినయ్‌భాస్కర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం ఇప్పటికే ఐటీ హబ్‌గా, ఎడ్యుకేషనల్ హబ్‌గా, కలచ్రల్ హబ్‌గా తీర్చిదిద్దినట్లు చెప్పారు. మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. సుదర్శన్, ప్రవీణ్, రంజిత్, చంతమ్మ, ఆసిఫ్, అలీమ్, పాల్సన్, రాజు, మనోజ్ పాల్గొన్నారు.

గెలిపిస్తే పశ్చిమకు సముచిత స్థానం

కాజీపేట: రానున్న రోజుల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సముచిత స్థానం దక్కాలంటే తనను అధిక మెజార్టీతో గెలిపించాలని వినయ్‌భాస్కర్ కోరారు. కాజీపేట 61వ డివిజన్ వడ్డెపల్లి ట్యాంక్ బండ్‌పై శుక్రవారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు కార్పొరేటర్ ఎలకంటి రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి, విజయపాల్ కాలనీ, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

కేయూ క్యాంపస్: టర్కీలోని ఇస్తాంబుల్‌లో ఈనెల 25 నుంచి 30వ తేదీవరకు నిర్వహించబోతున్న మెడిటరీనియన్ జియోసైన్స్ యూనియన్– 2023 అంతర్జాతీయ సదస్సుకు కాకతీయ యూనివర్సిటీ జీయాలజీ విభాగం ఆచార్యులు మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ వర్మ, పార్ట్‌టైం లెక్చరర్ డాక్టర్ సాయికృష్ణకు ఆహ్వానం అందిందింది. ఈ సదస్సులో వారు తమ పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు.

ఎన్నికల్లో ప్రజలే గెలవాలి

కేయూ క్యాంపస్: ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే గెలవాలని మందు, డబ్బును ఓడించాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 20 సంవత్సరాల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి నోచకోవడం లేదని రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి నోచుకోకుండా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. అనేక మంది నాయకులుగా, ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఎంపీలుగా ఎన్నికై వారి అభివృద్ధి మాత్రమే చూసుకున్నారన్నారు. 1931లో నిర్మించిన ఆజంజాహి మిల్లును మూసివేసిన నాయకులు ప్లాట్లు చేసి అమ్ముకున్నారన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రాలేదన్నారు.వరంగల్ జైలును కూలగొట్టి మహారాష్ట్ర బ్యాంకు తాకట్టుపెట్టారన్నారు. తెలంగాణ తొలిదశ ఉద్యమ ఫలితంగా ఏర్పడిన కాకతీయ యూనివర్సిటీని అన్ని రంగాల్లో నాశనం చేశారన్నారు.

విద్యుదాఘాతంతో 8గొర్రెలు మృత్యువాత



వరంగల్: వరంగల్ పైడిపల్లి శివారు విజయలక్ష్మి రైస్‌మిల్లు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాల్లోకి గొర్రెలు వెళ్లడంతో విద్యుతాఘాతానికి గురై 8గొర్రెలు మృత్యువాత పడినట్లు గొర్రెల కాపరి కోరే కుమారస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గొర్రెలు మేత మేసేందుకు వెళ్లిన క్రమంలో ఈప్రమాదం చోటు చేసుకుందని వాపోయారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష 20వేలు వరకు ఉంటుందని వివరించారు. ఈవిషయంపై ఏనుమాముల పోలీసుస్టేషన్ ఎస్సై రాజన్‌బాబును వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

అరుదైన వ్యాధికి చికిత్స

హన్మకొండ: స్టీవెన్ జాన్సన్ సిండ్రోమ్ కాలేయ వ్యాధితో బాధపడుతున్న వరంగల్ ప్రాంతానికి చెందిన వేణుకు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు లివర్ వ్యాధి స్పెషలిస్టు డాక్టర్ నవీన్ పోలవరపు తెలిపారు. చర్మంపై దద్దుర్లు, కంటిలోని తెలుపు భాగం పసుపు రంగులోకి మారడం, జ్వరం లక్షణాలతో వేణు గతనెల 28న హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో చేరారని ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అతడికి స్టీవెన్ జాన్సన్ సిండ్రోమ్ కాలేయ వ్యాధికి చికిత్స అందించినట్లు వివరించారు.

అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలి


వరంగల్ చౌరస్తా: ప్రచారం చేస్తున్న ఎర్రబెల్లి


కాశిబుగ్గ: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రదీప్‌రావు

- బీజేపీ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్ చౌరస్తా: తనను అన్ని వర్గాల ప్రజలు ఆదరించి గెలిపించాలని బీజేపీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. 27, 28వ డివిజన్లలోని పోస్టాఫీస్, చౌరస్తా, జేపీఎన్ రోడ్డు, సత్య హాస్పిటల్, ప్రింటింగ్ ప్రెస్ లేన్, రాధిక టాకీస్ ప్రాంతాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే తనను గెలిపించాలని సూచించారు.

బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం

కాశిబుగ్గ: బీజేపీతోనే బీసీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పార్టీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల కిరణ్ ఆధ్వర్యంలో 37వ డివిజన్ ఖిలా వరంగల్‌కు చెందిన పలువురు ముదిరాజ్ కులస్తులు శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలో వచ్చిన వారికి నిత్యం అందుబాటులో ఉంటానని, కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే బీసీ వ్యక్తే ముఖ్యమంత్రి అవుతాడని వివరించారు. పార్టీలో చేరిన వారిలో శ్రీనివాస్, కుమారస్వామి, పూర్ణచందర్, చిరంజీవి, శివకృష్ణ, గణేష్, నరేష్, రమేష్, సారయ్య, శ్రీకాంత్, యాదగిరి, వెంకటేష్, శామంతుల విజయ్, వీక్కి, రాజేష్, అశోక్ ఉన్నారు.

వైభవంగా తులసీధాత్రి నారాయణ కల్యాణం


తాళిబొట్టు చూపిస్తున్న గంగు ఉపేంద్రశర్మ


శివనగర్‌లో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్ : చారిత్రక రుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల దేవాలయంలో క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం తులసీ, ధాత్రినారాయణ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి ప్రాతఃకాల పూజలు, నిత్యాహ్నికం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసూక్తమంత్రపఠనంతో స్వామి వారిని 51కిలోల పెరుగన్నంతో హరిహరలుగా అలంకరించారు. మహానివేదన జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శివనగర్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో తులసీ – ధాత్రి నారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర్లు చార్యుల, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉసిరి, తులసి కల్యాణం జరిపించారు. మంగళస్నానం, రక్షబంధనం, బాషిక పూజ, జీలకర బెల్లం, మాంగల్యధారణను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సంక్షిప్తంగా

వైభవంగా మంగళకైశిక ద్వాదశి పూజలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా మంగళకైశిక ద్వాదశి పూజలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి వరంగల్‌లోని బాలాజీనగర్‌లో ఎస్సై భిక్షపతి, కాజీపేట విష్ణుపురిలో జడ్డి వెంకట్రామ నరసయ్య, గోపాల్‌పూర్‌లోని డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో మిత్తల్ అయ్యల్‌వారులు పాల్గొని కైశిక ద్వాదశి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ డీపీపీ జిల్లా బాధ్యులు రామిరెడ్డి, కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

అంజన్నకు లక్ష పూలతో ప్రత్యేక అలంకరణ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లో దక్షిణముఖ అభయాంజనేయ స్వామికి భక్తులు శుక్రవారం లక్ష పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పూలతో అలంకరించారు. దేవాలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలతో పాటు అలంకరణ చేశారు.

విద్యార్థి జేఏసీ పేరుతో చెలామణి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి జేఏసీ పేరుతో పలువురు నాయకులుగా చెలామణి అవుతూ బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కాకతీయ యూనివర్సిటీలో పనిచేశారని కేయూలోని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు తెలిపారు. ఇన్నిరోజులు తమ కార్యక్రమాలకు విద్యార్థులను వాడుకొని ఇప్పుడు వారు తమ స్వార్థం, స్వలాభం కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరారని దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని క్యాంటీన్ ఆవరణలో శుక్రవారం జరిగిన విద్యార్థి సంఘాల బాధ్యుల సమావేశంలో కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సుందర్, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద వీరస్వామి, కేయూ ఎస్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎండీ.పాషా పాల్గొని మాట్లాడారు.

కాంగ్రెస్ పార్టీకి డీఎంకే పార్టీ మద్దతు

నయీంనగర్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్ర డీఎంకే పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇన్‌చార్జ్ శివాజీ నాగరాజు, ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు దొమ్మటి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ అలయన్స్‌లో కాంగ్రెస్ పార్టీ ఉందని, అలాగే విపక్ష పార్టీలు ఏర్పాటుచేసిన ఇండియా కూటమిలో కూడా డీఎంకే, కాంగ్రెస్ ఉన్నాయని వారు వివరించారు.

ముస్లింలు రాజకీయంగా ఎదగాలి

ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీలు రాజకీయంగా ఎదగాలని తవక్కల్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ సూచించారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులో పలు డివిజన్ల ముస్లింలతో కలిసి ఆయన శుక్రవారం మాట్లాడారు. ముస్లిం, మైనార్టీలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కోరారు.

రేపు బీసీ కుల సంఘాల సమావేశం

నయీంనగర్: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీసీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని కోరుతూ ఈనెల 26న బీసీ కుల సంఘాలు, విద్యావంతులు, మేధావుల సమావేశాన్ని హనుమకొండ హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు బీసీ సంఘాల విద్యావంతుల వేదిక నాయకులు రవీంద్రనాథ్, రామినేని రాజేష్, కోలా జనార్దన్, బుట్టి శ్యాంయాదవ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 28బీసీ కుల సంఘాల ప్రతినిధులు తమ పూర్తి మద్దతును వినయ్‌భాస్కర్‌కు ప్రకటించారు.

మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా..


ఐనవోలు : గుర్రంపై స్వారీ చేస్తూ ప్రచారం చేస్తున్న అరూరి రమేశ్


మామునూరు : 44వ డివిజన్ అల్లీపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

- ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దు
- ప్రాణం ఉన్నంత వరకు ల్యాండ్ పూలింగ్ రానివ్వను
- బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి

ఐనవోలు : నియోజకవర్గ అభివృద్ధికి మూడోసారి అవకాశం ఇవ్వండి.. అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ కోరారు. మండలంలోని రెడ్డిపాలెం, నందనం, కక్కిరాలపల్లి, పెరుమాండ్లగూడెం, పంథిని, పున్నేలు, ఐనవోలు గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా తెలంగాణలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని ఆరోపించారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు ల్యాండ్ పూలింగ్ చేయనివ్వనని హామీ ఇచ్చారు. బీజేపీ మోటర్లకు మీటర్లు పెడుతామని చెబుతున్నారని, రైతులు ఆలోచించి బీజేపీకి కర్రుకాల్చి వాతపెట్టాలని అన్నారు. అనంతరంలో గుర్రంపై స్వారీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, రైతుబంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్ లలితాయాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి, వైస్ ఎంపీపీ మోహన్, మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, రవీందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే మళ్లీ గెలిపిస్తాయి

వర్ధన్నపేట: నియోజకవర్గంలో గతంలో ఎవరూ చేయలేని అభివృద్ధి ఎమ్మెల్యే అరూరి రమేష్ చేశారని, ఆయన చేసిన అభివృద్ధి పనులే తిరిగి మూడోసారి ఆయనను గెలిపిస్తారని ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు అన్నారు. వర్ధన్నపేట బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని బండౌతపురం, దమ్మన్నపేట, దివిటిపల్లి, రామవరం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తాము ఏ గ్రామానికి వెళ్లిన ఆ గ్రామాల ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని తిరిగి మూడోసారి అరూరిని భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాజేష్‌ఖన్నా, కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, మునిగాల సృజన రాములు, లత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అరూరి హ్యాట్రిక్ గ్యారంటీ

వరంగల్: వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అరూరి రమేశ్ హ్యాట్రిక్ సాధించడం గ్యారంటీ అని స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన అన్నారు. ఎస్ఆర్ నగర్ గ్రామశాఖ అధ్యక్షుడు పసులాది మల్లయ్య ఆధ్వర్యంలో డివిజన్‌లో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ముడుసు నరసింహ, నాయకులు సారయ్య, కేతిరి రాజశేఖర్, స్టాలిన్, ఆసిఫ్, సత్యం, ప్రభాకర్, రమేష్, షంషు, అశోక్, సరోజన, సరిత పాల్గొన్నారు.


వరంగల్ : ప్రచారం చేస్తున్న నాయకులు

44వ డివిజన్ అల్లీపురంలో ప్రచారం

మామునూరు: ఖిలా వరంగల్ మండలం 44వ డివిజన్ అల్లీపురం గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు పోతుగంటి రాజశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. బుస్సా వెంకన్న, ముప్ప సతీష్, లక్క రాజు, శీలం సాంబయ్య, అమరవాది ఉదయ్, ముప్ప అశోక్, నర్సయ్య, సింగారం చిరంజీవి, రాకేష్, భీమలింగం, బైరి యశోద, కట్కూరి అరుణ, బైరి రజిత, పోతుగంటి రజిత, ఆకుతోట లావణ్య, సమ్మక్క, గాదె నిర్మల, శ్రీలేఖ పాల్గొన్నారు.

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దేవాంగ్, తదితరులు

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'కెమికల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ న్యూఫ్రాంటియర్స్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న మూడో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ శుక్రవారం ప్రారంభమైంది. ఐఐటీ బాంబే మాజీ డైరెక్టర్, కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ దేవాంగ్ వి.ఖాఖర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభించి సావనీర్‌ను విడుదల చేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ, యూఎస్ఏ కార్నింగ్ ఇన్కార్పొరేటెడ్, రిటైర్డ్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె.పట్టాభిరెడ్డి, ప్రొఫెసర్లు సురేష్, ఉదయ్‌భాస్కర్, రాంసాగర్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న వృద్ధులు

మడికొండ: హోం ఓటింగ్ సదుపాయాన్ని మడికొండలోని పలువురు వృద్ధులు, వికలాంగులు శుక్రవారం సద్వినియోగం చేసుకున్నారు. మొదటిసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హోం ఓటింగ్‌కు విశేష స్పందన వస్తోంది.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

- వరంగల్ ఆర్టీఓ ఆఫ్రిన్ సిద్ధిఖీ



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆఫ్రిన్ సిద్ధిఖీ

ఖిలా వరంగల్: యువత తన ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ ఆర్టీఓ ఆఫ్రిన్ సిద్ధిఖీ కోరారు. ఎన్నికల్లో భాగంగా వరంగల్ రవాణాశాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఓటు హక్కును వినియోగంపై స్వీప్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 30న ఓటును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం స్వీప్ ఆధ్వర్యంలో వాహనదారులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నరసింహమూర్తి, ఎంవీఐలు రమేష్‌రాథోడ్, రవీందర్, వాహనదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాల పోటీలు ప్రారంభం


కబడ్డీ పోటీలో తలపడుతున్న జట్లు

రామన్నపేట: ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా పోటీలు నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం ప్రారంభమైనట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్ తెలిపారు. చదరంగం (బాలికల) విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్, చదరంగం (బాలుర)లో వీఎంఆర్ కళాశాల హనుమకొండ, వాలీబాల్ (బాలికల)లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్, ఖోఖో (బాలికల)లో ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ వరంగల్, కబడ్డీ (బాలికల)లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వరంగల్, టేబుల్ టెన్నిస్ (సింగిల్స్)లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్టేషన్‌ఘన్‌పూర్, టేబుల్ టెన్నిస్ (డబుల్స్)లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్టేషన్‌ఘన్‌పూర్ జట్లు విజేతలుగా నిలిచినట్లు వివరించారు. మిగిలిన పోటీలు, అథ్లెటిక్స్ పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు ప్రభాకర్ తెలిపారు.

అంధ జూడో క్రీడాకారులకు కిట్ల పంపిణీ

హన్మకొండ: వరంగల్ జిల్లా అంధ అండ్ పారా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ బ్రెయిలీ పాఠశాల క్రీడాకారులకు శుక్రవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కైలాస్‌యాదవ్ హాజరై కిట్లను అందజేసి మాట్లాడారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో లూయిస్ బ్రెయిలీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని ప్రశంసించారు. ఈనెల 26నుంచి 30వ తేదీ వరకు పంజాబ్‌లో జరగనున్న బ్లైండ్ జూడో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గతంలో కూడా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఎం.రాకేష్, బీ.హర్షిత్, జీ.దేవా, జీ.వినోద్, జీ.రాంచరణ్, ఈ.జీవన్, జీ.గౌతమ్, పీ.నాగరాజు జాతీయ స్థాయిలో ఆడనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి జూలూరి యుగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.